కళ్లకు గంతలు కట్టుకొని నిరసన

ప్రజాశక్తి - పాలకోడేరు

తమ భూములకు నష్టపరిహారం చెల్లించే వరకూ పోరాటం కొనసాగిస్తామని పాలకోడేరు ప్రభుత్వ ఇళ్ల స్థలాల రైతులు స్పష్టం చేశారు. పాలకోడేరు కోడిగట్టు జగనన్న లేఔట్ బాధితులు చేపట్టిన నిరసన సోమవారం ఆరో రోజు కొనసాగింది. దీనిలో భాగంగా బాధితులు కళ్లకు గంతలు కట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ప్రభుత్వం అన్ని విధాలా నమ్మించి మోసం చేసిందని, న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామని బాధితులు పేర్కొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్ బాధితులను పరామర్శించి వారు చేస్తున్న పోరాటానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం పేద రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు రామలక్ష్మి, సాయిబాబా, సత్యనారాయణ, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



- రారెత్తిస్తున్న ఎండలు
- జిల్లాలో 43 డిగ్రీలుపైనే ఉష్ణోగ్రతల నమోదు
- వేడి గాలులతో జనం హడల్
- రోడ్లపైకి రావాలంటేనే భయంభయం
- ఉపాధి కూలీలు, చిరు వ్యాపారుల పరిస్థితి దయనీయం
- కరెంటు కోతలతో వృద్ధులు, పిల్లలు విలవిల

'మండే' సూర్యుడు

ఎండల తీవ్రతకు జనం హడలిపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో సోమవారం (మండే) సూర్యుడు నిప్పులు కురిపించాడు. వేడిగాలులకు జనం రోడ్లపైకి రావాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. రెండు జిల్లాల్లోనూ 43 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, తాడేపల్లిగూడెం, భీమవరం, తణుకు ఇలా అన్ని పట్టణాల్లో ఎండ తీవ్రతకు జనం బెంబేలెత్తిపోయారు. కొద్దిరోజుల క్రితం వరకూ అకాల వర్షాలతో ఆకాశం మేఘావృతమై ఉండటంతో ఎండతీవ్రత పెద్దగా లేదు. రెండు, మూడు రోజులుగా ఎండల తీవ్రత తారాస్థాయికి చేరింది. ఉదయం ఏడు గంటల నుంచే ఎండ తీవ్రత ప్రభావం ప్రారంభమవుతోంది. దీంతో బయటికి వెళ్లాలంటేనే జనం భయపడే పరిస్థితి ఏర్పడింది. ఎండల తీవ్రతకు ముఖ్యంగా ఉపాధి కూలీలు, రోడ్లపై చిరువ్యాపారుల పరిస్థితి దారుణంగా మారింది. ఉపాధి పని రెండు పూటలు పెట్టడంతో కూలీలు ఎండ తీవ్రతకు అనారోగ్యం పాలవుతున్నారు. కూలీలు ఉదయం ఆరు గంటల నుంచి 12 గంటల వరకూ ఎండలోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉపాధి పనిచేసే చోట పూర్తిస్థాయిలో తాగునీరు, మజ్జిగ, టెంట్లు, మెడికల్ కిట్లు ఏ ఒక్కటీ సక్రమంగా లేని పరిస్థితి కొనసాగుతోంది. దీంతో కూలీలు ఎండ బారిన పడి కుప్పకూలుతున్నారు. రెండు పూటలా పని కొనసాగిస్తే ముందుముందు ఉపాధి కూలీలు మరింత దారుణ పరిస్థితులు ఎదుర్కోనున్నారు. ఉపాధి కూలీల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్లపై సైకిళ్లు, తోపుడు బండ్లపై పండ్లు, ఇతర వస్తువులు విక్రయించే చిరువ్యాపారుల పరిస్థితి దయనీయంగా మారింది. ఒకవైపు తారురోడ్డు వేడి, మరోవైపు ఎండతీవ్రతతో చిరువ్యాపారులు వడదెబ్బకు గురవుతున్నారు. వ్యాపారం సాగితే తప్ప రోజు గడవని పరిస్థితి ఒకవైపు, ఎండల తీవ్రత మరోవైపు ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇంకా ధాన్యం విక్రయాలు పూర్తికాకపోవడంతో పొలాల్లో ధాన్యం ఆరబెట్టేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.

కరెంటు కోతలతో జనం విలవిల

గ్రామాల్లో విచ్చలవిడిగా కరెంటు కోతలు విధిస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో ఎండ తీవ్రతకు తాళలేక జనం అల్లాడిపోతున్నారు. మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో గంటల తరబడి విధిస్తున్న కరెంటు కోతలతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు వేడికి తాళలేక నానాయాతన పడుతున్నారు. ఫ్యాను ఆగితే ఉక్కపోతతో విలవిల్లాడుతున్నారు. గ్రామాల్లో జనం కరెంటు కోతలతో నరకం అనుభవిస్తున్నారు. డెల్టాలో ఆక్వా చెరువులకు కరెంటు సరఫరా చేస్తూ గృహ అవసరాలకు కోతలు పెడుతున్నారంటూ జనం నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇన్వర్టర్లు కొనుగోలు చేసుకోలేని పేదలు కరెంటు కోతలతో ఇళ్లలో ఉండలేక చెట్ల కిందకు చేరి ఉపశమనం పొందాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండ వేడిమి తాళలేక మధ్యతరగతి ప్రజానీకం అప్పు చేసి ఎసిలు కొనుగోలు చేస్తున్నారు. వడగాల్పులపై ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో అధికారులు సూచనలిస్తున్నప్పటికీ అందుకు తగిన చర్యలు తీసుకోవడం లేదనే చర్చ సాగుతోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో మజ్జిగ, తాగునీరు చలివేంద్రాలు పెద్దఎత్తున ఏర్పాటు చేస్తే ప్రజలకు మేలు జరిగే అవకాశం ఉంది. దాతలు ఏర్పాటు చేసిన చలివేంద్రాలు కొన్ని ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆధ్వర్యంలో మరిన్ని ఏర్పాటు చేసి కొనసాగించాలని అంతా కోరుతున్నారు. ఉష్ణోగ్రతలు మున్ముందు మరింత పెరిగే పరిస్థితి ఉందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. దీంతో అందుకు తగినట్లుగా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోకపోతే సామాన్య ప్రజానీకం వడదెబ్బతో ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడనుంది.

కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు బాధితులను అడ్డుకుంటున్న పోలీసులు

దద్దరిల్లిన కలెక్టరేట్

- పెరుగులంక భూముల్లో అక్రమ తవ్వకాలను ఆపాలని డిమాండ్
- కెవిపిఎస్, వ్యకాస ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా
- కలెక్టరేట్ లోకి దూసుకెళ్లిన బాధితులు
- అడ్డుకున్న పోలీసులు : ఇరుపక్షాల మధ్య వాగ్వివాదం

ప్రజాశక్తి - భీమవరం

య ల మ ం చి లి మండలం చించినాడ గ్రామంలో దళితులకు చెందిన లంక భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలను ఆపకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్ హెచ్చరించారు. లంక భూముల్లో అక్రమ తవ్వకాలను ఆపాలని కోరుతూ కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం భీమవరం జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. వందలాది మంది బాధితులు ఆటోల్లో, మోటార్ సైకిళ్ల పై చించినాడ నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు తరలివచ్చారు. మాగోడు వినండి, మా భూములు కాపాడండి అంటూ చేసిన నినాదాలతో కలెక్టరేట్ దద్దరిల్లింది. ధర్నాను అడ్డుకునేందుకు పోలీసులు భారీ బారికేడ్లను ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు వీల్లేదని లంక భూముల బాధితులను, నేతలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో బాధితుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. మాటామాటా పెరిగి ఉధృత పరిస్థితులకు దారి తీసింది. నేపథ్యంలో ప్రజా సంఘాల నాయకులు, బాధితులు నేతలు భూముల తవ్వకాలను తక్షణం ఆపాలని, యలమంచిలి తహశీల్దార్‌ను సస్పెండ్ చేయాలని, ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు చూపుతున్న నిర్లక్ష్యం నశించాలంటూ నినాదాలు చేశారు. ఇలా ఉండగానే బాధితులతో కలిసి కలెక్టరేట్లోకి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులకు, బాధితలకు మధ్య మరోమారు వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో కలెక్టరేట్ వద్ద బైఠాయించి ధర్నా కొనసాగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జెక్కంశెట్టి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ పేదలు సాగుచేసుకొనే భూములను అక్రమంగా తవ్వడం దారుణమన్నారు. హైకోర్టు ఇచ్చిన జిఒలు తుంగలో తొక్కి అధికారులు అక్రమంగా తవ్వకాలు చేపట్టడం అన్యాయమన్నారు. భూస్వాముల భూములు వదిలి కేవలం దళితులు, బిసిలు, నిరుపేదల భూములను మాత్రమే తవ్వడమేంటని ప్రశ్నించారు. పెరుగులంక భూములు తవ్వితే వరద ముంపునకు గురయ్యేది దళితుల భూములేనని అన్నారు. పేదల భూముల్లో వ్యవసాయం కూడా చేసుకొనివ్వడం లేదన్నారు. తహశీల్దార్ అవినీతి అధికారిగా మారి పేదలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే ప్రజా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ చించినాడలో దళిత పేద కుటుంబాలకు చెందిన లంక భూముల్లో అధికారులు అక్రమ తవ్వకాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎస్‌సి, బిసి కుటుంబాలకు చెందిన 60 ఎకరాల భూములకు 1983లో ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని తెలిపారు. ఆ భూముల్లో వాణిజ్య పంటలు సాగు చేసుకొనేవారన్నారు. ఆక్వా వల్ల సర్వే చెట్లు కూడా పండేవి కాదన్నారు. కోవిడ్ అనంతరం ఆక్వా చెరువుల ప్రభావం వల్ల ఉమ్మడిగా ఆక్వా సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే గోదావరి వల్ల పెరుగు భూమి 10 ఎకరాలు పెరిగిందని చెప్పారు. ఈ భూమి పేద దళిత కుటుంబాలు ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. అక్కడ భూస్వాములు, అధికారులు అక్రమంగా ఆ 10 ఎకరాల భూమిలో మట్టి తవ్వి తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తహశీల్దార్ ప్రధాన పావుగా వ్యవహరిస్తున్నారని విమర్శించాఉ. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని హైకోర్టులో కేసు వేస్తే స్పందించిన న్యాయస్థానం మట్టి తవ్వకాలను ఆపాలని ఆర్డర్ ఇచ్చిందని తెలిపారు. అయినా హైకోర్టు ఆదేశాలను కూడా ఖాతరు చేయకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు, కొందరు రాజకీయ నాయకులు పోలీసు పహారా పెట్టి అక్రమంగా మట్టి తవ్వకాలను చేపడుతున్నారని విమ్మించారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు మాట్లాడుతూ దళితుల భూముల్లో అధికారులు దౌర్జన్యం చేయడం దారుణమన్నారు. తక్షణం అధికారులు ఆలోచనను విరమించుకోవాలన్నారు. ప్రశ్నిస్తే అక్రమంగా అరెస్టులు చేసి పోలీసుల పహారాలతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. తక్షణం అక్రమ తవ్వకాలను ఆపకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు మాట్లాడుతూ దళితుల చేతుల్లో ఉన్న కొద్దిపాటి భూమిని కూడా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు లాక్కోవాలని చూడడం దారుణమన్నారు. లంక భూముల పరిరక్షణ పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని తెలిపారు. అనంతరం 15 మంది ధర్నా బృందం సభ్యులను పోలీసులు కలెక్టరేట్‌లోకి అనుమతించడంతో జిల్లా కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు. జెసితో పాటు లంక భూముల్లో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి, జిల్లా ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు బత్తుల విజయకుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి మల్లిపూడి ఆంజనేయులు, కెవిపిఎస్ జిల్లా నాయకులు కానేటి బాలరాజు, చించినాడ గ్రామస్తులు గొల్ల ఏడుకొండలు, స్టాలిన్, నాగరాజు, జయప్రభ, పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద బైఠాయించిన బాధితులు, నేతలు

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

సమర్థవంతంగా సమస్యలు పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

స్పందనలో వచ్చిన ప్రతి సమస్యనూ సమర్థవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలు మూలల నుంచి వచ్చిన 153 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ స్పందనలో అందిన వినతుల పరిష్కారం అర్జీదారులకు సంతృప్తి కలిగించేలా ఉండాలన్నారు. అర్జీలు తిరిగి రీఓపెన్ అయ్యే అవకాశం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఒకే సమస్యపై రెండోసారి స్పందనలో ఫిర్యాదులు రాకుండా సమస్య పరిష్కారంలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రతి రోజూ స్పందనపై పది నిమిషాల సమయం కేటాయించినట్లయితే ఎప్పుడు సమ స్యలు అప్పుడే పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి, డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, డిపిఒ జివి మల్లికార్జునరావు, డ్వామా పిడి ఎస్‌టివి.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

నరసాపురం టౌన్: స్పందనలో వచ్చిన ప్రతి ఫిర్యాదుపైనా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని సబ్ కలెక్టరు ఎం.సూర్యతేజ ఆదేశించారు. సోమవారం నరసాపురం సబ్‌కలెక్టరు కార్యాలయం స్పందన సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి డివిజన్ నుండి వచ్చిన 64 ఫిర్యాదులను సబ్ కలెక్టర్ సూర్య తేజ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించే విధంగా మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్పందనలో అందిన అర్జీలను రీఓపెన్ కాకుండా స్పష్టతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో భూ సమస్యలు, రేషన్ కార్డులు, పింఛన్లు, హౌసింగ్, భూమి తగాదాలు, మత్స్యశాఖ, వైద్య ఆరోగ్యశాఖ తదితర సమస్యలపై వినతులు అందాయి. కార్యక్రమంలో డివిజన్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం : ఎస్‌పి

భీమవరం రూరల్: ఫిర్యాదుదారుల సమ స్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ పోలీసు అధికారులు సూచించారు. సోమవారం స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 26 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఫిర్యాదుదారులతో ఎస్‌పి స్వయంగా మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని వారికి భరోసా కల్పించారు. చీటింగ్‌పై 10, కట్నం కోసం వేధింపులపై 12, వేధింపులు 2, ఆస్తి తగాదాలు 2, రాగ ఫిర్యాదులను ఆయా పరిధిలోని స్టేషన్లకు రిఫర్ చేసి పరిష్కరించాలని ఆదేశించారు.

16న ఛాంబర్స్ కాలేజీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 16వ తేదీ మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ దీవిస్ లాబొరేటరీస్‌లో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే విద్యార్థులు 2021 - 22, 23లో ఏదైనా డిగ్రీ (కెమిస్ట్రీ), పీజీ (కెమిస్ట్రీ), బిఫార్మసీ చేసిన మేల్ విద్యార్థులు అర్హులన్నారు. అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్స్‌తో పాటు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు కళాశాల ప్లేస్మెంట్ ట్రైనర్ కె.లక్ష్మణ్‌రావు సెల్ 9701394660ను సంప్రదించాలని సూచించారు.

ఎంఎల్‌సిలుగా కవురు, వంక ప్రమాణ స్వీకారం

ఎంఎల్‌సిగా ప్రమాణ స్వీకారం చేసిన కవురు శ్రీనివాస్

ప్రజాశక్తి - పాలకొల్లు, తణుకు రూరల్

ఎంఎల్‌సిలుగా జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్ వెలగపూడిలోని శాసనమండలి కార్యాలయంలో సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. వారి చేత శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు ప్రమాణ స్వీకారం చేయించారు. ఉదయం పాలకొల్లు, తణుకు నుంచి భారీ ఊ రే గి ం వు గా కార్యకర్తలు, నేతలు తరలివెళ్లారు. ఎస్‌సి కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద ప్రకాష్, గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, కోరాడ శ్రీనివాస్, జోగి వెంకటేశ్వరరావు, మైఖేల్ రాజు, జోగాడ ఉమామహేశ్వరరావు వెలగపూడి తరలివెళ్లారు. అయితే ప్రమాణ స్వీకారం వద్దకు కేవలం ముఖ్య నేతలను మాత్రమే అనుమతివ్వడంతో పలువురు అసంతృప్తికి గురయ్యారు.



ఎంఎల్‌సిగా ప్రమాణ స్వీకారం చేసిన వంక రవీంద్ర

గోనె సంచులు సరఫరా చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెనుగొండ

ఆచంట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గోనె సంచులు సరఫరా చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ కోరారు. వడలి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు, వెంకటరమణ రైసు మిల్లును ఆయన పరిశీలించారు. అనంతరం రైతులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అకాల వర్షాల నేపథ్యంలో ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు రైతుల ఇబ్బందులను తొలగించడానికి స్వయంగా 10 లక్షల సంచులు సమకూర్చడం అభినందించదగ్గ విషయమే అయినా అన్ని మండలాల్లో సంచుల సరఫరా సక్రమంగా జరగడం లేదని తెలిపారు. పెనుగొండ, పెనుమంట్ర మండలాల్లో సంచులు అందుబాటులో లేక ధాన్యం రాశులు గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయన్నారు. ప్రభుత్వం బొండాలు రకం ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. వరి కోత యంత్రానికి గంటకు రూ.2,800 నుంచి రేటు పెంచి రూ.3,200 వసూలు చేస్తున్నారని, అధికార యంత్రాంగం కలుగజేసుకుని రైతులను ఆదుకోవాలని తెలిపారు. రైస్ మిల్లులకు ఎగుమతైన ధాన్యం మిల్లుల వద్ద బారులు తీరి ఉన్నాయన్నారు. ధాన్యాన్ని దింపడానికి ఒకటి నుండి రెండు రోజులు వేచి చూడాల్సి వస్తోందని తెలిపారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు.

సర్పంచికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

ప్రజాశక్తి - పెనుగొండ

ఏళ్ల తరబడి సిద్ధాంతం గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ.18,000 ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం సర్పంచి చింతపల్లి గన్ని రాజుకు, కార్యదర్శి ఎస్‌వి.నరసింహమూర్తికి కార్మికులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. టెండర్ కార్మికులకు జనశ్రీ బీమా యోజన (వైఎస్సార్ బీమా యోజన) గుర్తింపు కార్డులివ్వాలన్నారు. కార్మికులకు ప్రతి నెలా సబ్బులు, కొబ్బరినూనె అందించాలని, ఏటా యూనిఫారం, చెప్పులు ఇవ్వాలని తెలిపారు. కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలన్నారు. సర్పంచి గన్ని రాజు మాట్లాడుతూ తప్పనిసరిగా కార్మికులకు సంక్షేమ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు షేక్ పాదుషా, కార్మికులు కె.శివ, రమణ, ఆదినారాయణ పాల్గొన్నారు.

గుండెపోటుతో సిపిఎం సీనియర్ నేత రామ్మోహన్‌రావు మృతి

ప్రజాశక్తి - ఆచంట

సిపిఎం సీనియర్ నాయకులు, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు, వేమవరం చేనేత సొసైటీ మాజీ డైరెక్టర్ వాసా రామ్మోహన్‌రావు (72) సోమవారం గుండెపోటుతో భీమవరం ప్రయివేటు ఆసుపత్రిలో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రామ్మోహన్‌రావు 1982 నుంచి తుది శ్వాస విడిచే వరకూ అంకితభావంతో సిపిఎంలో పని చేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. ఆయన చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులుగా, ఆచంట వేమవరం చేనేత సొసైటీ డైరెక్టర్‌గా పనిచేశారని తెలిపారు. రామ్మోహన్‌రావు భౌతికకాయంపై సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, సిపిఎం నాయకులు వద్దిపర్తి అంజిబాబు, ఎస్‌విఎన్.శర్మ, సిర్రా నరసింహమూర్తి, గుత్తుల రంగారావు తలుపూరి బుల్లబ్బాయి, కొండేటి సత్యనారాయణ, రాపాక సత్యనారాయణ, సిర్రా విఘ్నేశ్వరుడు, మానుకొండ రాంబాబు, మాజీ యుటిఎఫ్ నాయకులు ఎకెవి.సత్యనారాయణ పార్టీ జెండా కప్పి జోహార్లు అర్పించారు. అనంతరం అంతిమయాత్ర నిర్వహించారు. రామ్మోహన్‌రావు అకాల మృతి పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, ఆచంట మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్, సిపిఎం సీనియర్ నాయకులు ఇందుకూరి సూర్యనారాయణ రాజు సంతాపం తెలిపి, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

రామ్మోహన్‌రావు భౌతికకాయానికి పార్టీ జెండా కప్పుతున్న సిపిఎం నాయకులు

శ్రీనివాస్ భౌతికకాయంపై పార్టీ జెండా కప్పి జోహార్లు అర్పిస్తున్న సిపిఎం నేతలు

శ్రీనివాస్ మృతి తీరని లోటు

ప్రజాశక్తి - గణపవరం

అప్పన్నపేటకు చెందిన సిపిఎం కార్యకర్త పట్నాల శ్రీనివాసు (58) మృతి తీరనిలోటని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. అప్పన్నపేటకు చెందిన శ్రీనివాస్ కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. సరపల్లిలో అత్తవారింటిలో వైద్యం తీసుకుంటూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. సోమవారం సరపల్లిలో శ్రీనివాస్ అంత్యక్రియల్లో ఆయన పాల్గొని జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ శ్రీనివాస్ 40 సంవత్సరాల పాటు కేశవరం ఏరియాలో పార్టీ ప్రజాసంఘాల్లో అంకిత భావంతో పనిచేశారన్నారు. శ్రీనివాస్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చింతకాయల బాబూరావు, రాజారామ్మోహన్‌రాయ్, జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నారపల్లి రమణారావు మండల నాయకులు పేట్నేట్టి నరసింహమూర్తి, పి.గోవిందు, ఎం.పెంటారావు, ఎస్.సంజీవిరావు, చిన్నం చిననాగేశ్వరరావు, డి.రామలింగరాజు పాల్గొన్నారు.

శ్రీనివాస్ మృతికి సంతాపం

పట్నాల శ్రీనివాస్ మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - ఉండి

గ్రామాల్లో వేసవి కాలం నేపథ్యంలో ఓల్టేజీలో హెచ్చుతగ్గులు వస్తున్నాయని, లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి విద్యుత్ సిబ్బంది కృషి చేస్తున్నారని ఉండి ఎలక్ట్రికల్ ఎఇ ముదునూరి మాధవరాజు అన్నారు. పెదపుల్లేరులో లోవోల్టేజీ సమస్య వస్తోందని గ్రామ సర్పంచి కరణం పార్వతి వెంకటేశ్వరరావు ఎలక్ట్రికల్ ఎఇ ముదునూరి మాధవరాజు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మాధవరాజు గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి అవసరమైన చోట మరమ్మతులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వేస్తామని మాధవ రాజు సర్పంచికి తెలిపారు. ఎలక్ట్రికల్ ఎఇ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నందుకు సర్పంచి కృతజ్ఞతలు తెలిపారు.

వెల్ఫేర్ బోర్డులో క్లెయిమ్‌లను పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ హెచ్చరించారు. ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) రాష్ట్రవ్యాప్త పిలుపుమేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పాలూరి లక్ష్మణరావు, ఏరియా అధ్యక్షుడు పడాల శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్ అనురాధకు వినతిపత్రం అందజేశారు.

భీమవరం :భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న 32 వేల క్లెయిమ్స్‌ను పరిష్కరించాలని, సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎఐటియుసి అధ్వర్యంలో సోమవారం భవన నిర్మాణ కార్మికులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ధర్నాను అడ్డుకోవడంతో పోలీసులకు, ఎఐటియుసి నాయకుల మధ్య కొంతసేపు వాగ్వివాదం చోటు చేసుకుంది.

హెచ్ఆర్ఎ పెంపు పట్ల ఎన్‌జిఒల హర్షం

ప్రజాశక్తి - భీమవరం

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నూతన జిల్లాలకు కూడా పాత జిల్లాలతో సమానంగా ఇంటి అద్దె భత్యంను 12 శాతం నుంచి 16 శాతానికి పెంచడం పట్ల ఎన్‌జిఒలు హర్ష వ్యక్తం చేశారు. రాష్ట్ర ఎన్‌జిఒ ఉపాధ్యక్షులు పెనుమరెడ్డి శ్రీనివాసులు, జిల్లా ఎన్‌జిఒ నాయకులు వి.శోభన్‌కుమార్, కెవిఎస్‌కె.రమేష్‌రెడ్డి, ఎన్.జగదీశ్వరరాజు, ఎం.సత్యనారాయణ స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు.

ప్రశాంతంగా ఎపిఇఎపిసెట్

ప్రజాశకి - తాడేపల్లిగూడెం

ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల ప్రవేశ పరీక్ష ఎపిఇ ఎపి సెట్ సోమవారం తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ పరీక్షా కేంద్రంలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 245 మందికి 240 మంది, సాయంత్రం నిర్వహించిన పరీక్షకు 245 మందికి 237 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రత్నాకరరావు తెలిపారు. పరీక్షా కేంద్రం కో-ఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్స్ అడ్మిన్ కొల్లా సురేష్, టిసిఎస్ ప్రతినిధులు పరీక్ష తీరును పర్యవేక్షించినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా సర్ ఆర్థర్ కాటన్ జయంతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఉభయగోదావరి జిల్లాల పంట భూములకు ధవళేశ్వరం ఆనకట్ట ద్వారా గోదావరి జలాలను అందించిన మహానుభావుడు సర్ అర్థర్ కాటన్ అన్నదాతల ఆరాధ్య దైవమని టిడిపి జిల్లా అధ్యక్షురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి అన్నారు. కాటన్ జయంతిని పురస్కరించుకుని భీమవరం టౌన్ ఇరిగేషన్ కార్యాలయం దగ్గర టిడిపి నాయకులు కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళి అర్పించారు.

నేరాలు - ఘోరాలు

హైదరాబాద్‌లో గొల్లవానితిప్పవాసుల ఆత్మహత్య

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మండలంలోని గొల్లవానితిప్ప గ్రామానికి చెందిన ఒక యువకుడు, వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం గ్రామంలో కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గొల్లవానితిప్పకు చెందిన ఆకుల శ్యామ్(24) పోలిశెట్టి జ్యోతి(22) ప్రేమించుకున్నారు. జ్యోతికి గతంలో భీమవరం చెందిన వేరే వ్యక్తితో వివాహమైంది. అయితే జ్యోతి ఆరు నెలలు తిరగకుండానే విడాకులు తీసుకుంది. గత 20 రోజుల నుంచి హైదరాబాద్ కెబిహెచ్‌బిలో ఒక ప్రయివేట్ హాస్టల్లో ఉంటుంది. శ్యామ్ రెండు రోజుల క్రితం హైదరాబాదులో ఫ్రెండ్ పెళ్లి ఉందని ఇంట్లో చెప్పి అదే ప్రాంతంలో ఉంటున్న కృష్ణ అనే స్నేహితుడు రూముకు వెళ్లాడు. అదే సమయంలో కృష్ణ ఊరికి వెళ్లాడు. ఈ క్రమంలో శ్యామ్, జ్యోతి ఆ రూములో ఆత్మహత్యకు పాల్పడ్డారు. శ్యామ్ ఉరేసుకోగా, జ్యోతి విషం తాగింది. రూమ్ నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సోమవారం ఉదయం పోలీసులు సంఘటన చేరుకుని పరిశీలించారు.

గ్యాస్ బిల్లలు మింగిన యువకుడు మృతి

ప్రజాశక్తి - మొగల్తూరు

గ్యాస్ బిల్లలు మింగిన యువకుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధి తూర్పుతాళ్లలోని సైపు వారి మెరకకు చెందిన చామకూరి లవకుశ (20) ఈ నెల 12వ తేదీన గ్యాస్ బిల్లలు మింగాడు. అతడిని కుటుంబసభ్యులు భీమవరంలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. మృతుని తండ్రి కొండలరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

చెరువు అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరులో పద్మావతి తాగునీటి చెరువు అభివృద్ధి పనులకు గ్రామ సర్పంచి సాదు శ్రీదేవి సోమవారం శ్రీకారం చుట్టారు. పద్మావతి చెరువు మిషన్ అమృత్ సరోవర్ పథకం కింద ఎంపికైంది. ఈ చెరువుకు రూ.10 లక్షలతో పాటు అవసరమైతే 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకునే వెసులుబాటు కల్పించారు. ఈ చెరువు విస్తీర్ణం రెండెకరాల 70 సెంట్లు. చెరువు అభివృద్ధి పనులు 3,713 పని దినాలు చేయనున్నారు. రూ.10.30 లక్షల అంచనాలు సిద్ధం చేశారు. మిషన్ అమృత్ సరోవర్ కింద పని కల్పించి కూలీల సంఖ్య పెంచాలని నిర్ణయించారు. కాళ్లకూరుకు సంబంధించి 761 మందికి జాబ్ కార్డులుండగా 541 జాబ్ కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. 840 మంది ఉపాధి కూలీలు పనులకు వెళ్తున్నారు. చెరువు రూపురేఖలు మార్చేందుకు ఉపాధి కూలీల ద్వారా పూడికతీత పనులు చేయించనున్నారు. అమృత్ సరోవర్ ద్వారా చెరువు రూపురేఖలు మారడంతో పాటు ఉపాధి పని దినాలు పెరగనున్నాయి. ఇప్పటికే అధికారులు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి క్షేత్రస్థాయిలో వేగంగా పనులు ప్రారంభించడానికి శ్రీకారం చుట్టారు. చెరువులో పూడికతీత పనులను పూర్తి స్థాయి లో చేపడతామని ఫీల్డ్ అసిస్టెంట్ ఈద రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి భర్త సాదు శ్రీనివాస్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పద్మావతి తాగునీటి చెరువులో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

మౌలిక సదుపాయాలను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రద్దు చేసిన మౌలిక సదుపాయాలను పునరుద్ధరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు తెలిపారు. సోమవారం మండలంలోని చినతాడేపల్లి, కడియద్ద గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు ఆయన వద్ద గోడు వెళ్లబోసుకున్నారు. పనిలో గాయపడితే ప్రాథమిక చికిత్సకు కూడా దిక్కులేదని వాపోయారు. ఆరు గంటకల్లా మస్తర్ వేయడానికి ఆదరా బాదరాగా వస్తున్నామని తెలిపారు. మండుటెండలో పనిచేస్తున్నా తమను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. గతంలో పని ప్రదేశంలో గాయపడితే మెడికల్ కిట్లు ఉండేవని, ఇప్పుడు దెబ్బ తగిలితే ప్రయివేటు డాక్టర్‌ను ఆశ్రయించి వైద్యం చేయించుకోవాల్సి వస్తోందని తెలిపారు. దీనిపై కండెల్లి సోమరాజు మాట్లాడుతూ ఉపాధి కూలీల పట్ల కేంద్ర ప్రభుత్వం తీరు సరికాదన్నారు. ఈ విధానం మారకపోతే రాబోయే ఎన్నికల్లో ఇప్పుడు కర్ణాటకలో బిజెపిని ఎలా సాగనంపారో అలాగే పేదలు, వ్యవసాయ కూలీలు బిజెపిని సాగనంపుతారని తెలిపారు. జగన్ ప్రభుత్వం పేదలు, వ్యవసాయ కూలీలకు అన్యాయం చేసి మోడీకి గొడుగు పడుతున్నాడని తెలిపారు. రద్దు చేసిన మౌలిక సదుపాయాలను పునరుద్ధరించాలని, లేకుంటే కూలీలు ఐక్యతతో పోరాడి సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డొక్కా వెంకటేశులు, సీలి రాణి, దూలపల్లి నాగమణి, దూలపల్లి వెంకటరత్నం, సిహెచ్.రాజేష్, యాతం నాగేశ్వరరావు, గంగిరెడ్డి బాపిరాజు, గట్టు నరసారావు, అడపాల బ్రహ్మాజీ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సోమరాజు

కొనసాగిన వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం ప్రథమ శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించినట్లు గ్రంథాలయాధికారి వనపల్లి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో సుమారు 30 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, సైన్సు పాఠ్యాంశాలపై విద్యాబోధన ఆటపాటలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రత్తి వీరస్వామి, ఎస్.సాల్మన్‌రాజు, మహాశివ, బట్టు లక్మణరావు పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు విద్యా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో 10 రోజులుగా నిర్వహించిన వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి సమాఖ్య కార్యవర్గ సభ్యులు మంచెం ఉమా మహేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ వైద్యులు కెఎస్‌పిఎస్.వర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ ప్రయోగాల పట్ల విద్యార్థులు చాలా ఆసక్తిగా ఉంటారని, చూడడం ద్వారా చాలా బాగా అర్థమవుతాయని తెలిపారు. కేవలం సైన్స్ ప్రయోగాలను10 రోజులపాటు బోధించడం అనేది మంచి విజ్ఞాన కార్యక్రమం అన్నారు. పాఠశాల హెచ్ఎం అడ్డాల నాని మాట్లాడుతూ ఇంత మంచి అవకాశాన్ని వినియోగించుకోవడానికి ఎండను సైతం లెక్కచేయకుండా విద్యార్థులు పాల్గొనడంతో ఈ కార్యక్రమం విజయవంతమైందన్నారు. సొంతంగా ఇంటి దగ్గర తయారు చేసి ప్రాజెక్టులు తీసుకొచ్చిన వారికి బహుమతులు అందజేశారు. పది రోజులు విద్యార్థులకు ప్రయోగాలు బోధించిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు చినిమిల్లి వెంకట్రావు, మేడిశెట్టి వెంకట గణేష్, జీవశాస్త్ర ఉపాధ్యాయులు పడవల బాలరాజు, మెంటల్ ఎబిలిటీ బోధించిన కొంతేటి ఫణి కుమార్, పేపర్ క్రాఫ్ట్ బోధించిన శిరిగినీడి రాజ్యలక్ష్మికి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ, కోశాధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాటన్‌ను ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించి లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందేలా చేసి చిరస్మరణీయుడయ్యాడని మార్టేరు ఇరిగేషన్ సెక్షన్ సహాయ కార్య నిర్వాహక ఇంజినీర్ జయశంకర్ అన్నారు. సోమవారం కాటన్ 220వ జయంతి సందర్భంగా మార్టేరు ఇరిగేషన్ సెక్షన్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళ లర్పించారు. ఈ సందర్భంగా జయశంకర్ మాట్లాడుతూ కాటన్ తన జీవితాన్ని బ్రిటీష్ భారత సామ్రాజ్యంలో నీటిపారుదల, నావికాయోగ్యమైన కాలువలు కట్టించడానికి ధారపోశాడన్నారు. ఈ కార్యక్రమంలో లాక్ సూపరింటెండెంట్ జోసెఫ్, శర్మ, ఇరిగేషన్ అసిస్టెంట్ బాబు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు: కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

పాలకొల్లు :కాటన్ జయంతి పురస్కరించుకుని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు నియోజకవర్గ తెలుగు రైతు, టిడిపి నేతలతో కలిసి కాటన్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ లర్పించారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ గోదావరి జిల్లావాసులు రెండు పూటలా అన్నం తింటున్నారంటే కాటన్ పుణ్యం అన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ముందస్తు చర్యలు

కాళ్ల :పెదఅమిరం గ్రామస్తులకు తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామ సర్పంచి సోమేశ్వరరావు ముందస్తు చర్యలు చేపట్టారు. రక్షిత మంచినీటి పథకం కొత్తచెరువుగట్టుపై గతేడాది ఐదు బోర్లు ఏర్పాటు చేశారు. ఆ బోర్లు దెబ్బతినడంతో వాటి మరమ్మతులు చేపట్టి నీటిని తోడే పనులు చేపడుతున్నారు. ఆయా పనులను గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, ఉప సర్పంచి జె.కిషోర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచి సోమేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంచినీటి చెరువులు పూర్తిస్థాయిలో నింపామన్నారు.

ముగిసిన ఉచిత శిక్షణ శిబిరం

ఉండి :బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఎండగండి గ్రామంలో నిర్వహించిన శిక్షణ తరగతులు సోమవారంతో ముగిసాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు కంప్యూటర్‌తో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించినట్లు గ్రంథాలయ అధికారి ఎన్‌సిహెచ్.రామకృష్ణ తెలిపారు. పదో తరగతి నుంచి ఆ పైన చదువుకున్న విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు రెజ్యూమ్ బిల్డింగ్, ఆన్‌లైన్‌లో జాబ్ సెర్చింగ్, అప్లై చేయడం, ఇంటర్వ్యూ స్కిల్స్‌ని పెంపొందించడం, పలు అంశాలలో శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్స్ అందించారు.ఈ కార్యక్రమంలో బైర్రాజు ఫౌండేషన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ దుర్గా ప్రసాద పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు రూ.600 ఇవ్వాలి

ప్రజాశక్తి - పెనుగొండ

ఉపాధి హామీ కూలీలకు రోజువారి వేతనం రూ.600 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి షేక్ పాదుషా డిమాండ్ చేశారు. మండలంలోని సిద్ధాంతం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఆచంట కాలువ తవ్వుతున్న ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం షేక్ పాదుషా మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులకు కనీస వేతనం రూ.600 చెల్లించాలని, రెండు పూటలా పని విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఖాతాలో రోజుకు వంద రూపాయలు మించి పడడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించడంలో కూలీ రేట్లు దారుణంగా పడిపోయాయని విమర్శించారు. కనీస వేతనం అమల్లోకి తీసుకురావాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

యువగళానికి సంఘీభావంగా టిడిపి నేతల పాదయాత్ర

ప్రజాశక్తి - ఉండి

ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు టిడిపి నేతలకు పిలుపునిచ్చారు. నారా లోకేష్ చేపట్టిన యువగళం కార్యక్రమం వందరోజులు పూర్తి చేసుకోవడంతో సోమవారం ఉండి ఎంఎల్ఎ రామరాజు ఆధ్వర్యంలో యువగళానికి సంఘీభావంగా మండ లంలోని చెరుకువాడ అభయాంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి ఉండి మెయిన్ సెంటర్ వరకు పాదయాత్రను కొన సాగించారు. ఉండి, ఆకివీడు, పాలకోడేరు, కాళ్ల మండలాల పార్టీ అధ్యక్షులు కరిమెరక నాగరాజు, మోటుపల్లి రాంప్రసాద్, దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు, గుండాబత్తుల నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు జుత్తిగ శ్రీనివాస్, పిన్నమరాజు శ్రీనివాసరాజు, రవిబాబు, చెన్నంశెట్టి హరినాయుడు పాల్గొన్నారు.

పెనుమంట్ర : నారా లోకేష్ యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తయిన సందర్భంగా సంఘీభావంగా మార్టేరు సెంటర్ నుంచి నిర్వహించిన నియోజకవర్గ పాదయాత్రలో మాజీ మంత్రి, టిడిపి పొలిటికల్ బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ తనయుడు వెంకట్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మార్టేరు కనకదుర్గమ్మ ఆలయం వద్ద నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర పెనుగొండ మీదుగా ముందుకు సాగింది. ఈ పాదయాత్రలో పార్టీ మండల అధ్యక్షులు తమనంపూడి శ్రీనివాసరెడ్డి (బుల్లాలు), కార్యదర్శి మురళీమోహన్‌రావు, నాయకులు చింతపల్లి రామకృష్ణ, వెలగలబుల్లి రామిరెడ్డి, సత్తిసాయి ఆదినారాయణ రెడ్డి, కర్రి అచ్యుత రామారెడ్డి, ఆచారి, సానబోయిన గోపాలకృష్ణ పాల్గొన్నారు.

తణుకు రూరల్ : తణుకు నియోజకవర్గంలో మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో అత్తిలి మండలం కె.సముద్రపుగట్టు గ్రామం నుంచి పాదయాత్ర చేపట్టారు. ఈ

ఉండిలో...

కార్యక్రమంలో తణుకు టౌన్ ప్రెసిడెంట్ కలగర వెంకటకృష్ణ, బసవ రామకృష్ణ, తణుకు మండల అధ్యక్షులు పితాని మోహన్, అత్తిలి మండల అధ్యక్షులు ఆనాల ఆదినారాయణ, ఇరగవరం మండల అధ్యక్షులు గోపిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : వైఎస్.పాలెం పంచాయతీ పితాని మేరక గ్రామం నుంచి నరసాపురం పట్టణంలోని టిడిపి నియోజకవర్గ కార్యాలయం వరకు పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో సుమారు ఎనిమిది కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. ఈ పాదయాత్రలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఎ.షరీఫ్, నరసాపురం నియోజకవర్గ అబ్జర్వ్ గుత్తుల సాయి పాల్గొన్నారు.

పెనుగొండ : మాజీ మంత్రి పితాని సత్యనారాయణ కుమారుడు పీతని వెంకట్ ఆధ్వర్యంలో ఎస్‌వికెపి కాలేజీ నుంచి గాంధీ బొమ్మలు సెంటర్ మీదుగా చెరుకువాడ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు సురేష్, గణేష్, రొక్కల సురేష్‌బాబు, మండ ప్రసాద్ పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లులో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు సారధ్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో టిడిపి నేతలు జివి.కర్నేన గౌరునాయుడు, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, అంగర వీరభద్ర కుమార్, పెన్మెత్స రామభద్రరాజు, పీతల శ్రీను, శ్రీరాముడు పాల్గొన్నారు.

ఇంటి డాక్యుమెంటు పడిపోయినది

ఉంగుటూరు మండలం, చేబ్రోలు గ్రామ పరిధిలో గల ఇంటి డాక్యుమెంటు నెం. 5488/2014, భీమడోలు (ఎస్.ఆర్.ఓ) ది.12-05-2023న చేబ్రోలు గేటు సమీపంలో పడి పోయినది. కావున దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

గొంతుమూర్తి నాగరాజు
చేబ్రోలు, ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా. సెల్: 95531 13116

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, గణపవరం మండలం, గణపవరం గ్రామం కాపురస్తులు బాతు ప్రకాష్, తండ్రి: బాతు వీరాస్వామి అను నేను నా యొక్క పాస్‌పోర్టు గణపవరం సెంటర్లో జిరాక్స్ తీయించుకుని మళ్లీ ఇంటికి మోటార్ సైకిల్ పై వెళ్తుండగా పాస్‌పోర్టు ఉన్న కవరు పడిపోయినది. పాస్‌పోర్టు నెంబర్ **H1762056** గల పాస్‌పోర్టు దొరికిన వారు ఈ క్రింది ఫోన్ నెంబర్ కు తెలియజేయ వలసిందిగా కోరుచున్నాము.

బాతు ప్రకాష్
తండ్రి: బాతు వీరాస్వామి, గణపవరం, గణపవరం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.
సెల్: 99596 04859

దస్తావేజులు పోయినవి

నా పేరు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, తండ్రి: కనకరాజు, కొమ్ముచిక్కాల. ది. 31-01-2023వ తేదీన ఉదయం 10 గంటల సమయంలో నేను ఒక బ్యాగులో దస్తావేజు నెం.3907/2002 మరియు 3846/1987 దస్తావేజులు జిరాక్సు కొరకు కొమ్ముచిక్కాల నుండి కవిటం నా మోటారు సైకిలు మీద వెళుతుండగా కవిటం చేరుకునే సరికి రెండు దస్తావేజులు కలిగి ఉన్న బ్యాగు జారిపడిపోయినది. నేను చుట్ట ప్రక్కల అంతా వెతికినాను కాని దొరకలేదు. సదరు విషయము పోడూరు పోలీసు స్టేషను వారికి ఫిర్యాదు చేయగా నా కంప్లయింటు రిజిష్టరు చేసి సర్టిఫికెట్టు ఇచ్చినారు. ఒక వేళ నా దస్తావేజులు ఎవరికైనా దొరికితే ఈ క్రింది ఫోన్ నెంబరుకు తెలియపర్చ కోరుచున్నాను.

గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు
కొమ్ముచిక్కాల. సెల్: 94409 84963

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో
S.T.C.No. 132/2022

బిట్వీన్:
బిక్కవోలు ప్రసాద్ రావు ...ఫిర్యాది
మరియు
కొండ్రెడ్డి మురళీకృష్ణ ...ముద్దాయి

ముద్దాయి:
కొండ్రెడ్డి మురళీకృష్ణ, తండ్రి: నరసారావు, వయస్సు 48, హిందూ, పురుషుడు, వ్యాపారం, డో.నెం.4-164-8/4, గణేశ్ నగర్, తాడేపల్లిగూడెం, తాడేపల్లిగూడెం టౌన్ పి.ఎస్., ప॥గో॥జిల్లా. సెల్: 98660 55885.

పై కేసులో ముద్దాయి అయిన మీరు పై చిరునామాలో ఉంటూ సమన్లు తీసుకొనక తప్పించుకు తిరుగుచున్నందువలన, ఇందు మూలముగా తెలియజేయునది ఏమనగా పై కేసులో మీ హాజరు కొరకు **ది.23-06-2023వ తేదీకి వాయిదా అయి ఉన్నది. సదరు తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకోవలసినది.** లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

కొవ్వూరి అప్పిరెడ్డి
న్యాయవాది, తాడేపల్లిగూడెం.
తాడేపల్లిగూడెం, 12-5-23. సెల్: 94401 28616

ఇంటర్లో చేర్పించండి

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని పదో తరగతి చదివిన విద్యార్థులను ఈ సంవత్సరం ఉండి హైస్కూల్లో ప్రారంభించిన ఇంటర్ కళాశాలలో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రధానోపాధ్యాయిని బేబీ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే ఇంటర్ విద్యార్థులకు ఎటువంటి రుసుం లేదని, వారికి టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్ ఉచితంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందజేస్తామని ఆమె తెలిపారు. 2024 విద్యా సంవత్సరం నుంచి ప్రమోషన్ మీద వచ్చిన ఉపాధ్యాయులు మాత్రమే ఇంటర్ విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తారని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఉండి హైస్కూల్లో చేర్పించేలా సహకరించాలని ఆమె కోరారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా శ్రీనివాస్ మళ్లీ ఎన్నిక

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా 11వ సారి తలుపుల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా సిద్దాని కోటి రామలింగేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా వేదాల నాగరాజు ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీగా ఎం.శంకరరావు, కోశాధికారిగా ఎన్.మోతీలాల్, లైబ్రరీ సెక్రటరీగా పామర్తి నగేష్, మహిళా కార్యదర్శిగా గుబ్బల నాగలక్ష్మి, కార్యవర్గ సభ్యులుగా పిట్ట రాజకుమార్, కత్తుల సత్యనారాయణ, పేరా వీరాజీ, భావన సునీల్, శ్రీనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి యోహాన్ సహాయ ఎన్నికల అధికారి హరగోపాల్ తెలిపారు.

రేపు భగ్గేశ్వరంలో కవురు శ్రీనివాస్ పర్యటన

పాలకొల్లు :ఎంఎల్‌సి ప్రమాణ స్వీకారం చేసిన కవురు శ్రీనివాస్ ఈ నెల 16వ తేదీ మంగళవారం పాలకొల్లు నియోజకవర్గ పరిధిలోని భగ్గేశ్వరంలో ఉదయం ఏడు గంటల నుంచి నిర్వహించే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల నాయకులు, గ్రామ సర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, మహిళ నాయకులు పర్యటనలో పాల్గొనాలని ఆయన కార్యాలయ సిబ్బంది సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మహారాజశ్రీ తణుకు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు
O.S.No. 308/2018
I.A.No. /2018

బిట్వీన్:
పెనుమర్తి అనుసూయ ...వాది
మరియు
తుట్టగుంట శ్రీరామచంద్ర మూర్తి మరియు 16 మంది ఇతరులు ...ప్రతివాదులు

డి-16: రెడ్డి వెంకట సత్యనారాయణ, తండ్రి: పల్లయ్య, డో.నెం. 9-21, వీరభద్రపురం, తణుకు.

పై నెంబరు దావాలో మీకు ఎన్ని పర్యాయములు దావా సమను మరియు Injunction I.A.లో నోటీసులు కోర్టు నుండి పంపినను ఉద్దేశ్యపూర్వకంగా మీరు తీసుకోకుండా తప్పించుకొనుచున్నందున పై నెంబరు దావాలో సమను మరియు ఐ.ఎ.లో నోటీసు మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా జారీ చేయుచున్నారు. కాబట్టి మీరు **ది.14-06-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయ్యి మీ వాదన తెలియపర్చనిచో సదరు దావా మరియు పిటీషను మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.**

ఎం.బాలాజీరావు
వాది తరుపు అడ్వకేట్, తణుకు.
తణుకు, 01-5-23. సెల్: 94406 14905

In The Court Of The Principal Junior Civil Judge :: Tanuku
O.S.No. 576/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Tanuku ...*Plaintiff*
VS
Vemula Venkata Lakshmi another ...*Defendants*

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1) వేముల వెంకటలక్ష్మి, భర్త: వర్ధనరావు, హిందువు, స్త్రీ, 37 సం॥లు, వ్యవసాయం, డో.నెం. 10-64/1, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2) వేముల వర్ధనరావు, తండ్రి: చిరంజీవి, హిందువు, పురుషుడు, 41 సం॥లు, వ్యవసాయం, డో.నెం. 10-64/1, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించినను మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.18-05-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

N.RAVI SHANKAR
Advocate, Tanuku.

మహారాజశ్రీ స్పెషల్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో :: తణుకు
C.C.No. 1/2019

బిట్వీన్:
ఫిర్యాది: శ్రీనివాస రైస్ & జనరల్ స్టోర్స్, ప్రొ॥ నడింపల్లి వీరవెంకట సూర్య నాగ సతీష్.
మరియు
ముద్దాయి: కాటూరి వీరరాఘవులు

ముద్దాయి హాజరు నిమిత్తం సెక్షన్ 82 of CRP ప్రకారం నోటీసు

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా పై నెంబరు కేసు నందు ముద్దాయి కాటూరి వీరరాఘవులు, తండ్రి: రామకృష్ణ, ప్లాటు నెం. 505, ఎస్.ఆర్.ఎస్.ప్లాజా, భారతిదేవి ఆసుపత్రి దగ్గర, ఆర్.పి.రోడ్డు, తణుకు, పశ్చిమగోదావరి జిల్లా వారికి మీరు జారీ చేసిన చెక్కు చెల్లనందున ఫిర్యాది మీపై క్రిమినల్ కేసు దాఖలు చేసియున్నారు. సదరు కేసు నందు మీరు హాజరు కానందున శ్రీ కోర్టు వారు మీపై ఎన్.బి.డబ్ల్యు జారీ చేసియున్నారు. సదరు ఎన్.బి.డబ్ల్యు అమలు జరుపుటకు మీరు పరారిలో ఉన్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులపై **తేదీ 01-06-2023 సం॥రం తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ తాలూకు ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను,** లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

జి.శ్రీనివాసకుమార్
ఫిర్యాది తరుపు అడ్వకేట్, తణుకు.
తణుకు, 10-5-23. సెల్: 94401 33719